# బందీ

**ఆర్థిక స్వాతంత్ర్యం ఉన్నా లేకున్నా స్త్రీకి బానిసత్వం తప్పడం లేదు. పితృస్వామ్య వ్యవస్థలో వ్యక్తిగతమైన, కుటుంబపరమైన బరువుబాధ్యతలు ఆమెను బందీని చేస్తున్నాయి**

వెధవ్వుద్యోగం. పొద్దున్న పదింటి నుంచీ సాయంత్రం ఆరింటిదాకా ఆఫీసులోనే కొట్టుకుంటే ఇంటికొచ్చాక చెయ్యడానికి టైమేం ఉంటుంది?"

చీరలకి ఫాల్స్ కొనాలి. మేచింగ్ బ్లౌజ్‌లు కొనాలి. అశోక్‌లో మంచి పిక్చరొచ్చిందట, చూసి రావాలి. అన్నీ సరదాలు కాదు, పనులే. ఇంకా చెయ్యాల్సినవి ఎన్నో ఉంటాయి. ఒంట్లో ఓపికుండదు. పాతికేళ్ళకే ముప్పాతికేళ్ళొచ్చినట్టు... ఛ... ఛ... దరిద్రపు ఉద్యోగం. చేరినప్పట్నుంచీ అసంతృప్తే నాకు. రోజులోని యాక్టివ్ పార్టంతా తినేసి, నన్ను నిర్వీర్యం చేసి ఇంటికి పంపించే ఈ ఉద్యోగం నాకెప్పుడూ నచ్చదు.

ఉద్యోగం అంటే ఇలాగే ఉండాలా? మరోలా ఉండకూడదా? మరోలా అంటే? నవ్వుతూ తుళ్ళుతూ అనాయాసంగా చేస్తున్నట్టు ఎందుకుండదు? రాసిందే రాస్తూ, చేసిందే చేస్తూ, జమా ఖర్చుల లెక్కలు ఒకటికి రెండుసార్లు సరిచూసుకుంటూ ప్రోటోటైప్‌గా ఎందుకుంటుంది?/ టర్న్ ద పేజ్ అండ్ లెర్న్ ద వర్క్.

పాతవాళ్ళకేనా కొత్తవాళ్ళకేనా ఒకటే సూత్రం. ముందువాడు ఐకి ఏ వంపులో చుక్క పెట్టి టీకి ఏ వంకర గీత గీస్తే మనమూ అలాగే చెయ్యాలి. ఒరవడి మార్చడానికి వీల్లేదు. కొంచెం క్రియేటివిటీ కోసమన్నా...

చాలీచాలని జీతం- పేరుకుపోతున్న అసంతృప్తి- ఏదో చెయ్యాలన్న ఆరాటం- ఏదీ చెయ్యలేని అసమర్థత...

జీవితం మారకం విలువ రూపాయల్లో...

కాలం విలువ అమూల్యం. అమూల్యమైనవెన్నో మనకి దొరకనట్టే ఇదీను.

అదే నా అసహనం. నాకొక్క గంట టైమ్ కావాలి. రోజు మొత్తంలో నా కోసం నేను ఖర్చు పెట్టుకోవడానికి కావాలి.

ఎవరూ నా తపన అర్థం చేసుకోరు.

అమ్మంటుంది: "ఆడపిల్లకు అంత అసహనం పనికిరాదే! ఓర్మి ఉండాలి."

ఓర్మిగా ఉండడానికి నేనేం అందరాడపిల్లల్లాగా పెరిగినదాన్ని కాదు. పద్దెనిమిదేళ్ళు నిండగానే, "నీ కట్నం డబ్బు నువ్వే సంపాదించుకోవా"లని అన్యాపదేశంగా హెచ్చరించి- ఉద్యోగంలో ఇరికించేసి- లోకం మీదికి వదిలారు.

పొద్దున్న ఆదరాబాదరాగా ఇంత తిని రెండు బస్సులు మారి, ఆఫీసుకెళ్ళి, బండరాత రాసి, మగ కబుర్లన్నీ విని, మళ్ళీ రెండు బస్సులు మారి ఏ ఏడింటికో ఇల్లు చేరే నాలో అమ్మ ఆశించే ఆడపిల్లతనం ఎక్కణ్నుంచి వస్తుంది?

తరువాతి అధ్యాయం పెళ్ళి

* * *

ఏడేళ్ళు నన్ను జాబ్ చేయనిచ్చి, వాళ్ళ చిన్నాచితకా అవసరాలు తీర్చుకొని నాకు సంబంధాలు చూడడం మొదలు పెట్టారు. కట్నాల అంబరంలో నా కందిన చందమామ నాలాగే క్లర్కు ఉద్యోగం చేసే పిల్లయితే బంగారు గుడ్లు పెట్టే బాతనే తలపుతో ఏరికోరి నన్ను చేసుకున్నాడు.

ఏడేళ్ళ కష్టార్జితానికి దక్కే ప్రతిఫలం ఇంతేనా అని నీరుకారిపోయాను.

"నయం ఏడేళ్ళకన్నా నీకు పెళ్ళి చేశారు మీవాళ్ళు. పదేళ్ళ నుంచీ నా సంపాదన తింటున్నా ఆ ధ్యాసే లేదు మా నాన్నకి. పాడి గేదెని పిండినట్లు పిండుకుంటున్నాడు. వదులుకోలేకపోతున్నాడు" అని ఓదార్చింది నా పక్క సీట్లో ఉండే రత్న.

సర్దుకుపోయాను.

ఎవరెవరికి ఎంతెంత జీతాలొస్తాయి (ఈ సంగతి ముందే తెలిసినా మరోసారి కన్ఫర్మేషన్ కోసం అని అనుకున్నాం), ఎంతెంత పాకెట్ మనీ అవసరం, ఇంట్లో ఎంత ఇవ్వాలి, మా కోసం ఎంత దాచుకోవాలి, పిల్లల్నెప్పుడు కనాలి... అన్నీ మొదటి రాత్రి మాడ్రన్‌గా చర్చించుకుని కాంట్రాక్టుకి వచ్చాం.

* * *

అత్తగారిది అదో టైపు.

"ఈవేళ వంకాయ కూర చెయ్యనా" అని అడిగితే, అది తప్పించి మరేదైనా వండు అంటుంది.

ప్రతిదీ ఆవిడకి చెప్పాలి. చెప్పడమంటే వట్టి చెప్పడం కాదు, విన్నవించుకోవాలి. ఆవిడ అనుమతి కోసం, ఆమోదముద్ర కోసం ఎదురు చూడాలి. ఉద్యోగస్థురాలిని నాకివన్నీ ఎక్కడ కుదుర్తాయి.

నాకు తోచిందేదో వండి, ఇంత తిని ఆఫీసుకు పరుగెత్తే నాకు కితాబులు- పొగరుబోతు పిల్ల! ఉద్యోగం చేస్తున్నానని అహంభావం! పెద్దవాళ్ళను గౌరవించడం రాదు అని.

"పోనీ అమ్మ చెప్పినట్లే చెయ్యకూడదూ?" భర్త రోల్లో భార్గవ సజషన్.

"టైమ్ చాలదు." కాలాభావంతో రగిలిపోతుండే నా మనసుకు నచ్చిన జవాబు!

"ఓ గంట నిద్ర తగ్గించుకుంటే సరి."

నాకు కమ్చీతో కొట్టినట్లయింది. రోజూ ఏడింటికి గానీ నిద్రలేవని మహానుభావుడు తనకన్నా గంట ముందు లేచే నన్ను ఇంకో గంట ముందు లేవమంటున్నాడు. అదీ నా కోసం కాదు, వాళ్ళమ్మకు ఆజ్ఞానువర్తినిగా ఉండడానికి. డామ్ షిట్!

పగ్గాలు నా చేతిలోకి తీసుకోకపోతే ఈ ఇంటితో నా ఉద్యోగానికి లంగరందదు. ఎవరు ఏమైనా అనుకోనీ. అచ్చం మగవాడిలాగే ఆలోచించాను.

కొంత సంఘర్షణ. కొంత ఒరిపిడి.

మరికాస్త పదను.

ఆపైన ఇంటివాళ్ళు ఎగరేసిన శ్వేతకేతనం!

* * *

నాకు ముగ్గురాడ బడుచులు. మా పెళ్ళైన దగ్గర్నుంచీ మా పెద్దాడ బడుచుకి పెళ్ళి చేసెయ్యాలని పట్టుకుంది మా అత్తగారికి.

ఆ పిల్ల కోసం ఎంత దాచాలో తెలీదు. మేం ఎంత ఇవ్వాలో చెప్పరు. వాళ్ళ దృష్టిలో అవన్నీ నాకు తెలియకూడని విషయాలు. అంటే... డబ్బు సంపాదించి ఇవ్వడం వరకే నా బాధ్యతగానీ, ఖర్చుల గురించీ, బాధ్యతల గురించీ అడిగే అర్హత నాకు లేదు. చూస్తూ ఊరకున్నాను.

రెండు సంబంధాలొచ్చాయి. ఒకటి డాక్టర్, ఇంకోటి లెక్చరర్.

పెళ్ళిలో నాకు పెట్టిన నెక్లెస్‌తో అలంకరించి పిల్లని చూపించారు. మా స్థాయి ఎంతలో ఉందో నాకర్థమైంది. రెండోసారి పెళ్ళిచూపులైన రాత్రే నేను భార్గవని అడిగేశాను.

"దుర్గ పెళ్ళికి ఎంత దాచారు? మనం ఎంత ఇవ్వగలం" అని.

"ఇంకా సంబంధమే కుదరలేదు కదా! కుదరనీ ముందు. డబ్బు సంగతి అప్పుడాలోచిద్దాం" అన్నాడు.

"ప్లానింగ్ అదీ ఏమీ లేదా?" షార్ప్‌గా అడిగాను.

"ప్లానింగంటే?"

"మనం ఏంత ఖర్చుపెట్టగలం? మన దగ్గర ఉన్నదెంత? ఇంకా ఎంత సమకూర్చుకోవాలి? దుర్గ ఒక్కర్తే కాదు కదా! తర్వాత ఇంకా ఇద్దరున్నారు. వాళ్ళ సంగతేంటి? ఇవన్నీ ముందుగా అనుకోరా?"

"ఏమోమరి! అవన్నీ నాకు తెలీదు. నన్నూ, తమ్ముణ్ణీ చదివించి ఇంత పెద్ద కుటుంబాన్ని లాక్కొచ్చేసరికే మా నాన్న పనైపోయింది. బాధ్యతంతా నాదీ, తమ్ముడిదీ" అన్నాడు భార్గవ.

"దుర్గ పెళ్ళికి అతనెంత ఇస్తాట్ట?"

భార్గవ ఇబ్బందిగా చూశాడు. "ఇలాటివి ఓపెన్‌గా మాట్లాడుకుంటారా?" అడిగాడు.

"ఇటువంటి విషయాలు చర్చించుకుని ఓ నిర్ణయానికి రాకపోతే సెటిలౌతాయా?" ఎదురు ప్రశ్న వేశాను.

"పాతిక ఎక్స్‌పెక్ట్ చేస్తున్నాను" అన్నాడు భార్గవ చివరికి.

"పాతిక... అంటే మనం...?"

"మిగతాది."

"అదే ఎంత?"

"ఎవరు చెప్పగలరు?"

"నేను చెప్పగలను."

"ఎంత?"

"ఇంకో యాభై."

"చాలా?"

"పెద్దపెద్ద సంబంధాలకి వెళ్ళకండి. బతికున్నంత కాలం వాళ్ళకి మనం భావదాస్యం, ఆర్థిక దాస్యం చెయ్యాలి. మనకి తగ్గ సంబంధం చూడండి."

"అమ్మ ఒప్పుకోదు."

"ఒప్పించండి."

"వినదు."

"అయితే, మీ తమ్ముడిలా మీరూ పాతిక చేతిలో పెట్టి ఊరుకోండి."

"అది కాని పని."

"యాభైకన్నా మనం ఖర్చు పెట్టడం కూడా కాని పనే. ఎగురలేని ఎత్తులకి ఎగిరి అవి అందుకోలేక కింద పడేకంటే ఇది బెటరు. మీరే ఆలోచించండి" అన్నాను.

మర్నాడు తల్లితో భార్గవ ఇదే మాట అన్నట్టున్నాడు. ఆవిడ తారాజువ్వలా నామీదికి లేచింది. ఎన్నెన్నో మాటలు, ఎన్నెన్నో తిట్లు.

భార్గవ తమ్ముడు రాంజీ నన్ను డిఫెండ్ చేశాడు.

ఆ ప్రకరణం ముగిసింది.

దుర్గకి టీచరు సంబంధం కుదిరింది.

* * *


మా ప్లానింగ్ ప్రకారం దుర్గ పెళ్ళైన తర్వాత మాకు శ్వేత పుట్టింది.

రాంజీకి పెళ్ళైంది. అతని పెళ్ళితో ముడిపెట్టి రెండో ఆడబడుచు అరుణ పెళ్ళి చేశాం. మిగిలిందల్లా లక్ష్మి ఒక్కర్తి. ఇంటరు చదువుతోంది. పెళ్ళికింకా తొందర్లేదు.

ఇంట్లోవాళ్ళలో మార్పొచ్చింది.

"ఈ చాకిరీ నేను చెయ్యలేనమ్మా" అని అత్తగారు

**ఈ ఉద్యోగం నాకెప్పుడూ నచ్చదు. ఉద్యోగం అంటే ఇలాగే ఉండాలా? మరోలా ఉండ కూడదా? అంటే - నవ్వుతూ తుళ్ళుతూ అనాయాసంగా చేస్తున్నట్లు ఎందుకుండదు?**



చిత్రాలు: నర్సిం

వినుక్కోవడం,

"పదయ్యేసరికి టింగురంగా అని ఆఫీను కెళ్ళిపోతే ఇంట్లో పనంతా ఎవరు చేస్తారు" అని రాంజీ భార్య వినుక్కోవడం,

వీళ్ళందరూ నా నుంచి పడుతున్న కష్టాలని కడతేర్చడానికి కంకణం కట్టుకున్నట్లు రాంజీ పొరుగూరు ట్రాన్స్‌ఫర్ చేయించుకోవడం, వరున క్రమంలో నా నిమిత్తం లేకుండా జరిగిపోయాయి.

చైతన్యంతో కిటకిటలాడిన ఇంట్లో మరణానంతరపు ప్రశాంతతలాంటిది చోటుచేసుకుంది. వెల వెలబోతున్న నాలుగ్గోడలు, వాటిమధ్య భావశూన్య మైన నిశ్శబ్దం... అగాధాలకి అటు అంచుని నేనూ, ఇటు అంచుని భార్గవ. మా ఇద్దరినీ ఒక్క దరికి చేర్చాలని చెరో చేతినీ మావైపు చాపుతూ చిన్నారి శ్వేత.

"నువ్వు హ్యూమన్ రిలేషన్స్ మెయింటైన్ చెయ్యడంలో ఫెయిలయ్యావు" భార్గవ నిరాకరించాడు. జరిగిన వాటి సినాప్సిస్ మీద అతని ఎనాలిసిస్.

"గాజు వస్తువు మీదికి రాయి విసిర్తే అది ఒక్కసారే పగుల్తుంది. పదేపదే విసిర్తే అందులో ఇంకా పగల డానికేమీ ఉండదు. నా మనసనే గాజు వస్తువు మీదికి ఇలా వచ్చి పడ్డ కంకర రాళ్ళెన్నో.

"కావచ్చు." భార్గవ మాటల్ని నేను ప్రతిఘటించలేదు. అతని మాటల్ని ఒప్పుకుంటూనే నా భావాలని చెప్పాను. "నేను ఎంప్లాయీని. ఒకరకంగా ఉద్యోగం అనే బందిఖానాలో బందీని. నా స్వేచ్ఛకి పరిధి ఉంది. నాకు కొన్ని లిమిటేషన్సున్నాయి. నేనేం చేసినా వీటికి లోబడే చెయ్యాలి. అలాంటప్పుడు మీరంతా కోరుకునే స్థాయిలో సత్సంబంధాలని మెయింటైన్ చెయ్యడం నావల్ల ఎక్కడ కుదురుతుంది?"

"లోకంలో నువ్వొక్కదానివే జాబ్ చేస్తున్నట్లు చెప్తావేంటి? మా ఆఫీనులోనే చాలామంది లేడీసున్నారు. వాళ్ళంతా చాలా డీసెంటుగా ఉంటారు" అన్నాడతను కోపంగా.

"మీ పక్కసీట్లో కూర్చుని డెకొరమ్ మెయింటేన్ చేసే స్త్రీలో ఆ టైమ్‌లో మీరు చూసేది ఒక భాగాన్నే. ఆమె సమర్థవంతంగా ఉద్యోగిని రోల్‌ని పోషించడాన్నీ, ఆమె వ్యక్తిగత జీవితాన్నీ, ఇల్లాలి పాత్రనీ తట్టి చూడండి. గుండెల్ని ఎన్ని ఉప్పెనలు ముంచెత్తుతుంటాయో. మనసుని ఎన్ని భావోద్వేగాలు చిందరవందర చేస్తుంటాయో."

"నాన్సెన్స్. ఉద్యోగాలొచ్చాక ఆడవాళ్ళకి ఎలాంటి ప్రాబ్లమ్సూ లేవు. అలా లేకపోవడమే నీకు పెద్ద ప్రాబ్లం."

"నిజం చెప్తే నాన్సెన్సికల్‌గానే ఉంటుంది. టిప్ టాప్‌గా గేబ్డిన్స్ వేసుకునే ఆనందరావులెందరో మైనూర్ క్రేవ్‌లో డ్రేపైన మయూరల్ని లాగి లెంప కాయలు వేసి తమ ఆధిపత్యాన్ని నిరూపించుకుంటూ ఉంటారని చెప్తే నమ్మరేం? లాగి లెంపకాయంటే మొహమ్మీద కాదు, మనసు మీద... అహం మీద... ఆభిజాత్యం మీద. మేనీజే థింకింగ్ యానిమల్ అన్నారు. ఆలోచనకి ఆయువుపట్టు మనసు. ఈ జాతికి చెందిన మగ జంతువు స్త్రీ జంతువుని ఆ ఆయువుపట్టు మీదే కొడ్తోంది... అర్థమైందా?" గట్టిగా అడిగాను. నా తప్పు లేకుండా, నా తపనేమిటో తెలుసుకోకుండా, నా నిస్సహాయతని అర్థం చేసుకోకుండా నన్నిలా అతను బ్లేమ్ చేస్తున్నాడని చాలా ఉద్రేకం వచ్చింది.

"నీ తలకాయ" అన్నాడు. నేను నీరుకారిపోయాను.

మా వాదన ఇలా ముగిసిపోయింది.

శ్వేతని క్రెచ్‌లో చేర్చి, మాకోసమే మేం బతకడం అనే కొత్త ప్రకరణానికి శ్రీకారం చుట్టాం. మొదట్లో భార్గవ చీటికీ మాటికీ ఒక్కడుగానో, పాపతోనో, నన్నూ కలుపుకునో తమ్ముడి ఊరు వెళ్ళొచ్చేవాడు. జేబులో ఉన్నదంతా వాళ్ళకి ఇచ్చేసి, వాళ్ళ పొగడ్తలకి ఉబ్బిపోయి, అంబరం మీద నడుస్తున్నట్లు తిరిగొచ్చేవాడు. నేనో క్షుద్రప్రాణి లాగేనా కనిపించే దాన్నో లేదో.

నెలాఖర్లో నా మీద పాకెట్ మనీకి డిపెండౌతూ నా చూపులు తన చూపుల్తో కలవకుండా జాగ్రత్త పడేవాడు.

క్రమేపీ తక్కువ డబ్బుతో అక్కడికెళ్ళడం, అక్కరకు రాని చుట్టమనిపించుకోవడం, ఆ తర్వాత వెళ్ళడం తగ్గించడం అనే మూడు మెట్లు దిగివచ్చి తర్వాత నాకు దగ్గరయ్యాడు.

"మనిషికీ మనిషికీ మధ్య ఉండేవి ఆర్థికపరమైన బంధాలే" అన్నాడు నాతో.

"నన్ను కూడా ఆ కోవలోకే చేరుస్తున్నారా." అడిగాను విస్మయచకితురాలినై.

"రా! ఇలా దగ్గరికొచ్చి కూర్చో" అన్నాడు. నేనలాగే చేశాను. అతను చాలా ప్రేమగా నన్ను దగ్గరికి తీసుకుని, "నువ్వూ, నేనూ వేరువేరని ఎప్పుడూ అనుకోలేదు. ఒకటిలో మనిద్దరం చెరిసగం. కానీ, మనిద్దరమే కలిసి జీవితం కాదు. అందులో ఒక భాగం సముద్రంలో చుక్కంత. సముద్రం లేనిదే మనకి అస్తిత్వం లేదు. చుట్టాలూ, బంధుత్వాలూ, బాంధవ్యాలూ... ఇవన్నీ ఉంటేనే మన ఉనికి. అర్థమైందా? నీకివి బోధపరచలేక నేనూ, గ్రహించలేక నువ్వూ కమ్యూనికేషన్ గ్యాప్‌తో అవస్థపడ్డాం ఇన్నాళ్ళూ" అన్నాడు.

నాకెంతో కొత్త ఉత్సాహం, కొత్త సంతోషం కలిగాయి. అతన్తో ఇంత సన్నిహితంగా ఎప్పుడూ గడపలేదు. పగలు పనీ, ఆఫీసు హడావిడీ. రాత్రి అలసట, పనుల వాయిదా.

అతని భార్యగా ఏ ఒక్క బాధ్యతేనా నిర్వర్తించానా నేను, డబ్బు సంపాదించడం తప్ప? నీకే కూరిష్టం? నీకే చీరిష్టం? నేనెలా ఉంటే నీకు నచ్చుతుంది అని అడిగానా? తెలుసుకోగలిగానా? కనిపించని సంకెళ్ళు నా వ్యక్తిగత జీవిత మాధుర్యం నుంచి నన్ను దూరంగా లాక్కెళ్తున్నాయి.

* * *

లక్ష్మికి పెళ్ళీడొచ్చింది. మేచెస్ చూస్తున్నారు. రాకపోకలు పునరుద్ధరించ బడ్డాయి. పెళ్ళిచూపులకి మా ఇంట్లోనైతే అనువుగా ఉంటుందని అందరి అభిప్రాయం. అందంగా అలంకరించబడిన డ్రాయింగ్ రూమ్, కలర్ టీవీ, ఫ్రిజ్ లాంటి అప్లయన్సెస్, సోఫాసెట్, క్రాకరీ - ఇవన్నీ పెళ్ళిచూపులకి అనువైన వాతావరణాన్ని సృష్టిస్తాయి. అంతా బాగానే ఉంది. నాకూ ఆ అమ్మాయి పెళ్ళి వీలైనంత తొందరగా జరిగిపోవాలనే ఉంది. కానీ...

"నీకిష్టం లేకపోయినా రాక తప్పలేదు. ఆడపిల్ల బాధ్యత తీర్చుకోవడానికి పౌరుషం చంపుకుని వస్తున్నాం" అంది మా అత్తగారు కొడుకు వినేలా.

నేను జవాబివ్వలేదు. ఘాటుగా మాట్లాడి ఆవిడ నోరు మూయించవచ్చు. మళ్ళీ నన్ను నొప్పించడానికి ఆవిడ మరో అస్త్రాన్ని వెతుకుతుంది. నేను కూడా ఎదురుదాడికి సిద్ధపడాలి. ఇదంతా ఇంగ్లండ్, ఫ్రాన్స్‌ల మధ్య జరిగిన వందేళ్ళ యుద్ధం లాంటి వ్యవహారం. తెగదు, పొసగదు. అందుకే మౌనాన్ని ఆశ్రయిస్తాను.

తమాషా ఏమిటంటే, రాంజీ భార్య నాలా

మాట పడి ఊరుకోదు. అత్తాకోడళ్ళిద్దరూ హెూరాహెూరీ దెబ్బలాడుకుంటారు.

ఎడమొహం పెడమొహంగా తిరుగుతారు.

రాంజీ దగ్గర ఒకళ్ళ మీద ఇంకొకళ్ళు చాడీలు చెప్పుకుంటారు.

అన్నీ అయ్యాక మళ్ళీ కలుసుకుంటారు. అంటే, వాళ్ళిద్దరికీ ఒకళ్ళ అంతరంగంలోకి మరొకరికి ప్రవేశం ఉందన్నమాట.

నాకన్నా నా తర్వాత వచ్చిన ఆ అమ్మాయే మా అత్తగారికి ఎక్కువ సన్నిహితురాలు.

నాకూ ఆవిడకీ మధ్య ఒక లక్ష్మణరేఖ ఉంది. దాన్ని అధిగమించే ప్రయత్నం ఎవ్వరమూ ఎప్పుడూ చెయ్యము. ఆవిడే కాదు, రాంజీ భార్య కూడా.

ఇంకా తమాషా ఏమిటంటే, గత్యంతరం లేక నీ ఇంట్లో అడుగు పెట్టామని బాహాటంగా ప్రకటించిన మా అత్తగారు అలాగేమీ ఉండడం లేదు.



భార్గవకి చెప్పి ఎయిర్‌కూలర్ మా బెడ్‌రూమ్ లోంచి హాల్లోకి మార్పించుకుంది.

టీవీకి డిష్, స్టార్ వగైరా కనెక్షన్లన్నీ ఇప్పించుకుంది. రిమోట్ ఆవిడ చేతిలోనే ఉంటుంది.

ఒక్కమాటలో చెప్పాలంటే మా ప్రైవసీ జాతీయం చెయ్యబడింది.

నేను పావు తక్కువ పదింటికి చెప్పుల్లో కాళ్ళు పెట్టగానే అంతా తేలిగ్గా నిశ్వసిస్తారు. మళ్ళీ తిరిగి రాగానే వాతావరణం బిగునుకుపోవడాన్ని నేను స్పష్టంగా గమనిస్తాను. వాళ్ళ మధ్య కూర్చుని నవ్వుతూ కబుర్లు చెప్తున్న భార్గవ మొహంలోని నవ్వు కూడా నా రాకతో చిత్రంగా మాయమౌతుంది.

"వచ్చావా" అంటాడు. ఇంకేం అడగాలో, మాట్లాడాలో తోచనట్టు.

"ఊఁ" అంటాను.

నేను చెప్పులు విడిచి కాళ్ళూచేతులూ కడుక్కుని మా గదిలోకి దారితియ్యగానే అతనూ నా వెంట వచ్చేస్తాడు. మా వెనుక మిగిలినవాళ్ళు మొహాలు చూసుకుని నవ్వుకుంటారు.

చాలా ఇబ్బందికరమైన పరిస్థితి. నా ఇంట్లో నేనే అవాంతర వ్యక్తిని. ఈ కుటుంబంతో ఇన్నేళ్ళ అనుబంధం ఉన్నా ఏ ఒక్కరికీ దగ్గర కాలేకపోతున్నాను.

భార్గవ నన్ను ప్రేమించే మాట నిజమేగానీ, తన పేరెంట్స్ ఎదురుగా నా ఉనికిని స్థిరపరచలేడు.

హాల్లోకెళ్ళి అందరి మధ్యా కూర్చుంటే అత్తగారికి తప్పు. మామగారి ఎదురుగా సోఫాలో నేను కూర్చోకూడదు. టీవీప్రోగ్రామ్స్ చూడాలంటే ఓ వారగా మోడా లాక్కుని ఒదిగి కూర్చుని చూడాలి. మామగారు అటూ ఇటూ తిరుగుతున్నప్పుడు లేచి నిల్చోవాలి. వాళ్ళు పెట్టే ప్రోగ్రామ్సే చూడాలి. తలా తోకా లేని తెలుగు సినిమాలూ, అర్థం పర్థం లేని సినిమా పాటలూ చూస్తూ కూర్చోవాలి.

"ఆరున్నర దాటాకా ఇంట్లో అడుగుపెట్టి, టీవీ కతుక్కుపోయి కూర్చుంటే పనెలాగౌతుంది?" నన్న నన్నగా గొణుగుతుంది అత్తగారు.

అందుకే మా గదిలో నన్ను నేను బంధించుకుంటాను.కానీ, ఎంతకాలం ఇలా? స్వేచ్ఛ లేకుండా?

భార్గవ తన ఒక్కడి జీతంతోనే అయితే ఇవన్నీ కొనలేడు. వీటి వెనుక నా చెయ్యి కూడా ఉందని, ఈ సౌకర్యాలు అనుభవించడంలో నాకూ భాగం ఉంటుందని ఎందుకు గ్రహించరు? ఈ సమష్టి కృషిలో నాకూ భాగం ఉందని ఎందుకు సమాదరించరు? ఎందుకీ సెకండ్ కేటగిరీ ట్రీట్‌మెంట్? రాంజీ భార్యకి కూడా ఇలాటి ఆంక్షలే ఉన్నాయా? లేవు. ఆమెకి తన ఇంటిమీద గ్రిప్పుంది. కనుసన్నల్తో అందర్నీ శాసించగలిగే నేర్పుంది.

నేనో?!

ఇల్లంతా వీళ్ళ మీద వదిలేసి వెళ్తాను. ఇల్లు వీళ్ళదే ననిపిస్తుంది.

చంటిపిల్లల్తో చేసుకోలేదని ఓ పూట వంట మా అత్తగారే చేస్తుంది. ఆ పిల్ల ఇబ్బందిగా ఫీలౌతుందని మామగారు ముందు గది వదిలి రారు. వచ్చినా ఆ పిల్లపట్ల వాత్సల్యాన్ని ప్రకటిస్తారు. మనుషుల్లో ఎందుకిన్ని ముఖాలు? నాతో ఒకలా, ఆ పిల్ల దగ్గర ఒకలా ఎందుకు ప్రవర్తిస్తారు? ఇక్కడ ఇలా, అక్కడ సర్దుకుంటూ మరోలా ఎందుకు గడుపుతారు?

నాకో పరిష్కారం కావాలి.

* * *

"నేను వాలంటరీ రిటైర్మెంట్ తీసుకోవా లనుకుంటున్నాను" అన్నాను చాలా ఆలోచించాక భార్గవతో.

అతను అర్థం కానట్లు చూశాడు.

"రెండు లక్షలదాకా వస్తుంది. శ్వేత చదువుకీ, పెళ్ళికీ లక్ష దాస్తే చాలు. యాభై లక్ష్మి పెళ్ళికిద్దాం. మిగిలిన యాభై మన అవసరాలకి ఉపయోగపడ్తాయి. నాకు వెయ్యిపైగా పెన్షనొస్తుంది. చాలదా" అనడిగాను.

"బ్రిలియంట్ అయిడియా" అన్నాడు భార్గవ సంతోషంతో రియాక్టౌతూ.

ఇద్దరం కలిసి ఎన్నో కలలు కన్నాం.

రోజూ పొద్దున్నే భార్గవకిష్టమైన ఇడ్లీలూ, పచ్చడీ చేసి పెడ్తాను. అవి తిని అతను హ్యాపీగా ఆఫీసుకెళ్తాడు. మధ్యాహ్నం వచ్చేసరికి వేడివేడిగా అతనికి ఇష్టమైనవి చేసి పెడ్తాను. సాయంత్రం అతను తిరిగొచ్చేసరికి నేను చక్కగా తయారై ఉంటాను. అతనికి చెస్ చాలా లైకింగ్. ఇద్దరం టెర్రెస్ మీద కూర్చుని చెస్ ఆడవచ్చు, ఫ్రెండ్సిళ్ళకు వెళ్ళవచ్చు, పాప స్కూల్ ప్రోగ్రామ్సుకు ఎటెండవ్వచ్చు. అనివార్యమైన పనుల్లా కాకుండా అందులోని ఆనందాన్ని ఆస్వాదిస్తూ...

"పెళ్ళికి ముందు నువ్వు సుఖపడ్డావో లేదో తెలీదు. పెళ్ళయ్యాక మాత్రం ఇంటా బయటా పనితో నలిగిపోయావు." భార్గవ ప్రేమతో అన్నాడు.

పెంచలేనని శ్వేత తర్వాత బాగా గ్యాప్ ఇచ్చాము. ఒక్క పిల్లతో ఆపరేషన్ చేయించుకోవడానికి మనస్కరించలేదు.

శ్వేతకు తోడుగా ఇంకొక్కరుంటే...

ఆ ఆలోచనలకే నా ముఖం ఎర్రబడిపోయింది. భార్గవ వింతగా చూశాడు.

*　　　*　　　*

ముందుగా నాకున్న ఆఫ్‌పే లీవుని పెట్టేశాను. వాలంటరీ రిటైర్మెంట్ నోటీసు కూడా ఇచ్చాను.

ఇంక ఆఫీసుకు వెళ్ళననుకుంటే... ఇంట్లో తిరుగుతుంటే నాలో ఏదో ఉత్సాహం పెల్లుబుకుతోంది.

"ఇప్పుడు సెలవెందుకు పెట్టావు." అత్తగారు అడిగింది.

"తాను వాలంటరీ రిటైర్మెంట్ తీసుకుంటుందటమ్మా! ముందుగా కొన్నాళ్ళు లీవు పెట్టి ఇంట్లో ఉంటే బావుంటుందని..." భార్గవ చెప్తుంటే అతని గొంతులో దాచినా దాగని సంతోషం. అందరిలా గడపాలని అతనికి మాత్రం ఉండదా?

"ఇప్పుడు ఉద్యోగం వదులుకోవాల్సిన అవసరం ఏమిటి? మీకంతగా డబ్బు ఎక్కువైతే నా చేతికివ్వండి. సవాలక్ష ఖర్చులున్నాయి." మామగారు వెంటనే కలగజేసుకున్నారు. "పెద్దవాణ్ణి నాతో ఒక్క మాటేనా చెప్పకుండా అంతా మీ ఇష్టమేనా?" కోపంగా అడిగారు.

"ఇందులో మనం పెద్దగా వర్రీ అవ్వాల్సిందేం

"ఒకసారెప్పుడో మీతో చెప్పాను. ఉద్యోగం అనే బందిఖానాలో బందీనని. నాలాంటి బందీలకు విముక్తి ఉండదు- బదలీ తప్ప. ఆ జైల్లోంచి బయటపడ్తే ఇక్కడ మరో జైలు ఎదురు చూస్తోంది."

లేదు నాన్నా. రెండు లక్షలు డబ్బిస్తారు. నెలకింతని పెన్షనొస్తుంది. తాను ఇంటిపట్టునే ఉంటుంది." భార్గవ డబ్బు లెక్కలన్నీ చెప్పేశాడు.

అలా చెప్పకుండా ఉండాల్సిందన్న ఆలోచన నాకు కలిగింది.

కొన్ని తర్జనభర్జనలయ్యాయి. మొత్తం మీద నేను ఇంట్లోనే ఉండబోతున్నాననేది నిర్ధారితమైంది.

*　　　*　　　*

ఇంట్లో ఒక స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ఒక ఆత్రత, ఒక తొందర కనిపిస్తున్నాయి. అదేమిటో నాకు తొందర్లోనే తెలిసిపోయింది.

భార్గవ నన్ను వాళ్ళ ఫ్రెండింటికి తీసుకెళ్ళాడు. గంట తర్వాత తిరిగొస్తామని చెప్పి ఇంట్లోంచి బయల్దేరాం.

తీరా వెళ్ళేసరికి వాళ్ళింటికి తాళం ఉంది.

వెంటనే తిరిగొచ్చేశాం. మేం వచ్చేసరికి తలుపులు ఓరగా వేసి ఉన్నాయి. మాటలు గట్టిగా వినిపిస్తుండడంతో యాంత్రికంగా ఆగిపోయాం.

"రెండు లక్షలొస్తుందట. ఏం చేసేట్టో?" మామగారి గొంతు.

"పెళ్ళప్పుడు ఉద్యోగం చేస్తుందని పెద్దగా కట్నం ఇవ్వలేదు. దుర్గకీ, అరుణకీ చేసినట్లు లక్ష్మికీ చిన్న సంబంధం తెస్తానంటే వదిలేది లేదు. ఇంట్లో ఆఖరి ఆడపిల్ల. మంచి సంబంధమూ తేవాలి. పెళ్ళీ గ్రాండుగా చెయ్యాలి." అత్తగారు చెప్తోంది.

"రిటైరైపోయి ఖాళీగా ఉంటున్నాను. పాతిక ముప్పై వేలతో ఏదైనా చిన్నపాటి వ్యాపారం మొదలు పెడ్తే సరి. చిన్నమొత్తమే గాబట్టి వచ్చినా పోయినా అంత బాధ ఉండదు. నాకు కాలక్షేపం."

"మంచి ఆలోచనే. అదేదో ఇక్కడే చెయ్యండి. ఇల్లూ వసతీ బావున్నాయి. సదుపాయాలన్నీ ఉన్నాయి. చిన్నాడి ఇంటికెళ్తే ఈ సౌఖ్యాలెక్కడివి? ఇన్నాళ్ళూ అంటే ఈవిడగారు ఆఫీసుకు తగలడ్తే ఇంట్లో పనంతా చూసుకుంటూ పడుండాలని అక్కడి కెళ్ళి ఉన్నాం. ఇహమీదట ఆ బాధ లేదు గదా!"

"పనీ అదీ చేస్తుందంటావా? నీమాట వింటుందా?"

"ఇహమీదట ముప్పొద్దులూ తేరగా మేపద్దూ? వినకేం చేస్తుంది?"

"పెన్షనొస్తుందట."

"ఏమూలకి? ఏదైనా జీతంపాటి చెయ్యదు కదా?"

నాకింక మాటలు వినిపించడం మానేశాయి. కాళ్ళ కింది నేల కదుల్తున్నట్లనిపిస్తుంటే భార్గవని ఆసరాగాచేసుకున్నాను. అతని పరిస్థితీ అలాగే ఉంది.

లక్ష్మికి పెద్ద సంబంధం... మామగారి వ్యాపారానికి పెట్టుబడి... అత్తగార్ని కూర్చోబెట్టి చెయ్యడం... పద్దెనిమిదేళ్ళ ప్రాయం నుంచీ నా కాలాన్నంతటినీ వెచ్చించి నేను సాధించిందేమిటి? మిగుల్చుకునేదేమిటి? కొడుకు సంపాదనని కోడలితో పాటు పంచుకోవడం మన పద్ధతి. కోడలి సంపాదన మీద కూడా మాదే హక్కంటే ఎలా?

ఉద్యోగం ఉంది కాబట్టి ఆస్తిపాస్తులు లేకపోయినా కొండంత అండగా ఉండేది. ఉద్యోగం వదులుకొని... తద్వారా వచ్చిందంతా వదులుకొని... ఇంట్లో పడుంటే... అప్పుడు మాత్రం నేను కోరుకున్న జీవితానందం నాకు దక్కుతుందా?

ఒక్క పిల్లతో సరిపెట్టుకుని... ఉద్యోగం చేసింది ఆ పిల్లకేదో ఒరగబెట్టాలని కదూ? చదువూ, వైద్యం, బట్టలు... అన్నీ లగ్జరీలైపోయిన ఈ రోజుల్లో శ్వేతకి మంచి చదువూ, పెళ్ళీ చెయ్యలేని నిస్సహాయ పరిస్థితిని తెచ్చుకునేట్లయితే... అది రేప్పొద్దున్న అడగదూ. మూణ్ణెల్ల పిల్లప్పట్నుంచీ నన్ను క్రెష్‌లో వదిలేసి ఆఫీసుకెళ్ళావు. నా కోసం ఏంమిగిల్చావని? భార్గవ సంపాదనని అతనివాళ్ళతో తానూ పంచుకుంది. న్యాయానికి నాకూ, శ్వేతకీ తిండి పెట్టే బాధ్యత అతనిది. అతని మీద అలాంటి బరువుని వెయ్యలేదు. పైగా అతని బరువుల్లోనూ, బాధ్యతల్లోనూ చేయూతనిచ్చింది. దుర్గకిగానీ, అరుణకిగానీ ఎందులోనూ తక్కువ చెయ్యలేదు. లక్ష్మికీ చెయ్యబోదు. కానీ, వీళ్ళకి సంతృప్తిలేదు. వీళ్ళకు కోడలక్కర్లేదు. కొడుకు బాగు అక్కర్లేదు. కోడలనే మనిషొకర్తి వచ్చి కొడుక్కి అండగా నిలబడి, అతణ్ణి బట్టి ఆ ఇంట్లోవాళ్ళ అవసరాలు చూస్తోందనిలేదు. అసలు వీళ్ళకు మనుషులక్కర్లేదు. కట్టుబానిసలు కావాలి.

భార్గవ కేసి తీక్షణంగా చూశాను.

అతను తల దించుకున్నాడు.

తప్పుల్ని పరిష్కరించడం అతనికి చేతకాదు. ఇలా తలదించుకోవడమే వచ్చును. నాకు ఆసరా ఇవ్వాల్సిన వ్యక్తే ఇలా వెన్నెముక లేనట్లు కుప్పకూలిపోతుంటే నేనెంతకని ఒంటరి పోరాటం చెయ్యగలను? ఇంట్లోవాళ్ళకు నేను ఎడం కానీ ఇతను కాదు. మా ఇద్దరి మధ్యా ఉన్న దగ్గరితనం అతనికి వాళ్ళతో ఉన్న అనుబంధాన్ని ప్రభావితం చెయ్యదుగానీ నాకూ, వాళ్ళకూ ఉన్న ప్రేమలేమి మా ఇద్దరి మధ్యా దూరాన్నీ, అగాధాల్నీ సృష్టించిందనేది అనుభవైకవేద్యం. ఇతనూ అందరు భర్తల్లాంటివాడే. నాది స్త్రీవాదం కాదు. స్ట్రగుల్ ఫర్ కో ఎగ్జిస్టెన్స్.

అక్కడికక్కడే అప్పటికప్పుడే నిర్ణయించేసుకున్నాను తెలివైన స్టెప్ వెయ్యాలని. వెంటనే భార్గవతో అన్నాను: "నేను నోటీసు విత్‌డ్రా చేసు కుంటాను. ఒకసారెప్పుడో మీతో చెప్పాను. ఉద్యోగం అనే బందిఖానాలో బందీనని. నాలాంటి బందీలకు విముక్తి ఉండదు- బదలీ తప్ప ఆ జైల్లోంచి బయటపడ్తే ఇక్కడ మరో జైలు ఎదురు చూస్తోంది."

అతను మళ్ళీ తలొంచుకున్నాడు. ■



# నిశ్శబ్దం పలికే పద్యం

## మనసుకు మాత్రమే అవగతమయ్యే అనుభూతి సౌందర్య రహస్యాలు



**అనుభూతి గీతాలు (1970-96)**
రచన: ఇంద్రగంటి శ్రీకాంతశర్మ
ప్రతులకు: నవోదయబుక్‌హౌస్, ఆర్యసమాజ్ మందిర్ ఎదుట, కాచిగూడ క్రాస్ రోడ్స్, హైదరాబాద్-27.
పేజీలు:109.
వెల: రూ. 35/-

పసునూరు శ్రీధర్‌బాబు

కావలసిన అసలైన శబ్దమెప్పుడూ నిశ్శబ్దంలో దాగుంటుంది(పుట: 40).ఇంద్రగంటి శ్రీకాంత శర్మ ఇవాళ్టి కవి కాదు. అలాగని సనాతనుడూ కాదు. మూడు దశాబ్దాలుగా సాహిత్య సేవ చేస్తున్న సృజనశీలి. కవిత్వభాష అంటూ ఒకటి వేరే ఉంటుందని... కవిత్వం ఏకాంతంలో వ్యక్తిని విద్యుత్కరించేది కావాలని నమ్మిన కవి. *అనుభూతి గీతాలు* పేరుతో మొదటిసారిగా ఆయన 1976లో కవిత్వ సంకలనం వెలువరించారు. ఆ తరువాత వచ్చింది *నిశ్శబ్దం గమ్యం*. ఎరుపెక్కిన కవిత్వ ప్రవాహంలో ఆనాడది తెల్ల కలువలా తలెత్తుకుని నిలిచింది. *అనుభూతి గీతాలు* పేరుతోనే మళ్ళీ ప్రచురించిన ఈ కొత్త సంకలనంలో ఆయన ఇంత వరకూ రాసిన కవిత్వాన్ని (అనుభూతి గీతాలు '76, నిశ్శబ్దం గమ్యం) తిరిగ్గా కాచి వడబోసి కవిత్వంగా తేల్చి మిగిల్చిన 73 పద్యాలు ఉన్నాయి.

*కాషాయాంబరధారి సూర్యుడు/జనప చేలోంచి నడిచిపోతుంటే/చీకట్లు మంచు జడిని / జలజల దులిపేస్తాయి చెట్లు / ...ఆకుపచ్చ రెక్కలు విప్పిన అనాది క్షణంలో శబ్ద ప్రపంచం నుంచి నిశ్శబ్ద శిఖరానికి / నా ప్రయాణం...*

శబ్ద ప్రపంచం నుంచి నిశ్శబ్ద శిఖరాలకు సాగించే ఈ ప్రయాణంలో నిజానికి కవి తన మనసును మెలిపెట్టే అనుభూతులను పలికించే శబ్దాల కోసమే ఆరాటపడతాడు. నిశ్శబ్దంలో పల్లవించే ఆ శాబ్దిక ధ్వని తరంగాలు ఇట్లా ఉంటాయి: *గతాన్నీ భవిష్యత్తునీ కలిపే స్వప్న సేతువు ఈ ఏకాంతం-/ సూర్య కిరణాల జీవధార/ నిద్రపోయే నది గుండెను తట్టి పడవను మేలుకొలుపుతుంది-*

*ఒక ముఖంతోనే పుడదామనుకున్నాను... కాంక్షలు పురివిప్పినట్లు/పది ముఖాలతో పుట్టాను... ఇది బహుముఖ ఏకపాత్రాభినయం-*

*అందుకే కామోసు... దేవుడు కనబడితే బాగుణ్ణు/ బాల్యంలోకి వెళ్ళనిమ్మని అడుగుతాను* అంటున్నారు. అంతటితో ఈ ఏకాంత అగ్నికీల చల్లారితే *బాగుణ్ణు- స్వప్నాలు తగలబడుతున్న వేళ/ స్మృతే చితి* అని కవి వాపోకుండా ఉండును.

అనుభూతి కవికి చిత్రమైన కోరికలుంటాయి. అవి పసివాని అల్లరి మల్లే ఉంటాయి. అందుకే కలల్నీ, అలల్నీ, వెన్నెలల్నీ, మంచుపట్టిన దిగులు కొండల్నీ ఏకాంతంలో ఒలకబోసుకుని ఏ కనిపించని దాని కోసమో కలత పడుతుంటాడు. ఇది జీవితాన్ని మనసారా అనుభవించాలనుకునే అత్యాశాపరుని అంతరంగం. "సమాస ప్రలోభాల్ని, భాషాచాపల్యాన్ని", ఇంకా అక్కడక్కడ మిగిలే ఉన్న పదాల గారడీల్ని, ఉత్తుత్తి వచనాన్ని ఉపేక్షిస్తూ ఈ కవిత్వంలోకి ప్రవేశిస్తే కొన్ని కన్నీళ్ళలాంటి జాజిమల్లెల్ని, జాజిమల్లెల్లాంటి కొన్ని కన్నీళ్ళను ఆర్ద్రంగా మూటగట్టుగోవచ్చు. ■